అడుగడుగునా 'నకిలీ' పురుగులు

- అన్నదాతలను ముంచేస్తున్న డొల్ల కంపెనీలు
- నమ్మకంతో కొనుగోలు చేసి నష్టాలపాలవుతున్న రైతులు
- కొనే సమయంలోనే అప్రమత్తత అవసరం
- అనుమతి ఉన్న దుకాణాల నుంచి తీసుకుంటేనే మేలు


పంటలను దుక్కులు చేసుకుంటున్న రైతులు

రాయచోటి జగదాంబసెంటర్ : ఖరీఫ్ సీజన్ వచ్చింది.. రైతులను ఆకర్షించేలా కొత్త పురుగుల మందులు, విత్తనాల కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఈ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసే రైతులు ముందుగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేస్తుంటారు. ఇలాంటి సమయంలో అనుమతులు లేని కంపెనీలవి మార్కెట్లోకి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి.

వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఖరీఫ్ సాగుకు పొలాలు దుక్కులు దున్ని.. విత్తనాలు విత్తేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. రైతులు విత్తనాలు సమకూర్చుకునే పనిలో ఉన్నారు. ఈ సమయంలో పలు రకాల విత్తన కంపెనీల ప్రచారం జోరందుకుంది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతుల అవసరాన్ని అవకాశంగా భావించి విత్తనాలను తక్కువ ధరల ఆశచూపి నకిలీలతో రైతులను నట్టేట ముంచే అవకాశం ఎక్కువగా ఉంది. రోజు రోజుకు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కంపెనీలు ఆకర్షణీయమైన ప్రకటనలు, ప్రచార ఆర్భాటాలతో రైతులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైతులు విత్తనాల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని లైసెన్సులు ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదులు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు ఎంపికపై అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ శాఖ రైతులకు పలు జాగ్రత్తలను సూచిస్తుంది. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసేటప్పుడు నియమ నిబంధనల ప్రకారం ఉన్నాయో లేవో సరిచూసుకుని కొనుగోలు చేయాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వ్యవసాయ శాఖ లైసెన్సు కలిగిన దుకాణాలు, డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన బిల్లులను పంట కాలం పూర్తయ్యేంత వరకు భద్రపరచుకోవాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడి పేరు కచ్చితంగా ఆ సంచిపై ఉందో లేదో చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు, ఎరువులు కొనకూడదు. అలాగే సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే మొలక శాతం చూసుకోవాలి. ఎరువుల నాణ్యత, పురుగు మందులపై అనుమానం ఉంటే తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు సహాయంతో పరీక్షలకు పంపాలి.
- సంచుల్లో ఎరువుతో పాటు అన్యపదార్థాలు కనిపిస్తే దానిని కల్తీ ఎరువుగా గుర్తించాలి.
- బిల్లులపై విక్రయదారుడి పేరు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమ్మకపు పన్ను నెంబర్, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారుడి సంతకం, రకం, బ్యాచ్ నెంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి.
- వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారుల సూచనలు పాటించాలి.

అవగాహన కలిగి ఉండాలి

రైతులు విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల కొనుగోలులో అవగాహన కలిగి ఉండాలి. విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో ప్రభుత్వ నిబంధనలు రైతులు పూర్తిగా తెలుసుకొని కొనుగోలు చేయాలి. వేరే ప్రాంతంలో అధిక దిగుబడి వచ్చిందని చెప్పే అక్రమార్కుల మోసపూరిత మాటలు నమ్మి నకిలీ విత్తనాలు కొనుగోలు చేయకూడదు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు రైతులు తప్పక పాటించాలి.
– వంగిమళ్ల రంగారెడ్డి, రైతు సంఘం నాయకుడు

అనుమతులు లేనివి కొనుగోలు చేయొద్దు

ప్రభుత్వ అనుమతులు లేని విత్తనాలు కొనుగోలు చేసి రైతులు మోసపోకండి. బ్యాచ్ నంబరు లేని పురుగుమందులు కొనుగోలు చేయరాదు. కొన్న వెంటనే దుకాణం నుంచి బిల్లు తీసుకోవాలి. ఆ బిల్లును పంట చేతికి వచ్చే వరకకు భద్రంగా ఉంచుకోవాలి. ప్రైవేటు వ్యక్తుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయరాదు. ఏమైనా అనుమానాలు ఉంటే సంబంధింత వ్యవసాయ కార్యాలయాల్లో సంప్రదించాలి.
– నాగమణి, ఏఓ, రామాపురం

స్మార్ట్ మీటర్లను అడ్డుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

మదనపల్లె : విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని దీన్ని ప్రజలు, కార్మికులు వ్యతిరేకించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నర్సింహులు పిలుపునిచ్చారు. ఆదివారం మదనపల్లిలో మున్సిపల్ స్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ చార్జీల బాదుడు ప్రారంభమైందన్నారు. దీన్ని తిప్పి కొట్టేందుకు ప్రజా ఉద్యమమే పరిష్కారమని అన్నారు. కృష్ణా జిల్లాలోని గుడివాడ ఎన్టీఆర్ కాలనీవాసులు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తిరస్కరించారని గుర్తుచేశారు. ఇప్పటివరకు వాడుకున్న యూనిట్ల ప్రకారం విద్యుత్ చార్జీలు చెల్లిస్తున్నారని, రాబోయే రోజుల్లో స్మార్ట్ మీటర్ల వల్ల ప్రీపెయిడ్ రీచార్జ్ విద్యుత్ బిల్లులు ముందస్తుగానే చెల్లించాల్సి వస్తుందన్నారు. ట్రూ అప్, ఇంధన తదితర చార్జీల పేరుతో విద్యుత్ వినియోగం ఖరీదుగా మారుతుందని తెలిపారు. ఆగస్టు 10, 11, 12 తేదీల్లో సీపీఐ జిల్లా 2వ మహాసభలు మదనపల్లెలో జరుగుతున్నాయని ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున మహాసభలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏఐటీయూసీ మదనపల్లి పట్టణ కార్యదర్శి తిరుమల, జిల్లా సమితి సభ్యులు దేవా, ఉపాధ్యక్షుడు వాసు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మస్తాన్, చలపతి నాయుడు పాల్గొన్నారు.

ఉన్మాదులను వెంటనే అరెస్టు చేయాలి

- బుద్ధుడి విగ్రహ ధ్వంసం కేసును నీరుగార్చే యత్నం
- పీటీఎం శివప్రసాద్ నిర్బంధం అప్రజాస్వామికం
- రౌండ్ టేబుల్ సమావేశంలో బాస్ సంఘం తదితర నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న బాస్ నాయకులు

రాయచోటి టౌన్ : మదనపల్లె రూరల్ పరిధిలోని అంకిశెట్టిపల్లె గ్రామంలోని గొండపై వెలసిన గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఉన్మాదులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ధ్వంసం చేసిన తరువాత ఫిర్యాదు స్వీకరించాల్సిన పోలీసు అధికారులు నిమ్మకుండిపోవడం చూస్తుంటే కేసును నీరుగార్చడమేనన్నారు. బుద్ధుడి విగ్రహం తల నరికిన వారిపై కేసు నమోదు చేయాలని శాంతియుతంగా దీక్ష చేస్తున్న వారిని అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. దీక్షకు నాయకత్వం వహించిన బౌద్ధ ఉపాసకులు పీటీఎం శివప్రసాద్‌ను అరెస్టు చేసి, దీక్ష శిబిరాన్ని ధ్వంసం చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో రెచ్చిపోయిన పోలీసులు శివప్రసాద్‌ను పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. అలానే ఆయన అస్వస్థతకు గురయ్యేలా చేసి పోలీస్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాస్ రాష్ట్ర కార్యదర్శి పల్లం తాతయ్య, పౌర హక్కుల సంఘం నాయకులు వంగిమళ్ల రమణ, న్యాయవాది రెడ్డెయ్య, బాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎంవీ రమణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకురాలు పద్మావతి, బాస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్, బంజారా రాష్ట్ర నాయకులు శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌస్ బాషా, రజక సంఘం జిల్లా నాయకులు రమేష్, శ్రీనివాసులు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు సుధీర్, విద్యార్థి సంఘం నాయకులు కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను మోసం చేస్తే పాతేస్తాం

- రాజంపేటలో టీడీపీని ఓడించింది వర్గ విభేదాలే
- టీడీపీ నాయకులే కార్యకర్తలపై కేసులు పెట్టి వేధింపులు
- సుగవాసి అభిమానులకు అండగా ఉంటా
- పాలకొండ్రాయుడు సంస్మరణ సభలో సుగవాసి ప్రసాద్‌బాబు


పాలకొండ్రాయుడు సంస్మరణ సభలో మాట్లాడుతున్న సుగవాసి ప్రసాద్‌బాబు

సుండుపల్లె : మాజీ ఎంపీ స్వర్గీయ సుగవాసి పాలకొండ్రాయుడు ఆశయ సాధన కోసం పనిచేస్తానని టీటీడీ మాజీ పాలకమండలి సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. ఆదివారం మండల కేంద్రానికి సమీపంలోని భైరవగుట్ట వద్ద సుండుపల్లి మండలానికి చెందిన టీడీపీ నాయకులు సుగవాసి పాలకొండ్రాయుడు సంస్మరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుగవాసి ప్రసాద్‌బాబు సొంత పార్టీలో ఉన్న వర్గ రాజకీయాలపై విరుచుకుపడ్డారు. ఆయన మాట్లాడుతూ మేము ఎన్టీఆర్ వారసులమని టీడీపీ నాయకులు వర్గ రాజకీయాలు చేస్తూ కార్యకర్తలను విస్మరిస్తే సహించేది లేదన్నారు. పార్టీ ఆదేశానుసారం పనిచేస్తామని కార్యకర్తలను మోసం చేస్తే పాతేస్తామన్నారు. కష్టపడి పనిచేసిన ఏ కార్యకర్త జోలికి వచ్చినా మీ తరఫున నేను ముందుండి పోరాడతానన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో రాజంపేట నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలు చేసి టీడీపీ ఓటమికి కారణమైన వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, నారా లోకేష్ ఆదేశానుసారం టీడీపీ కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే కొంత మంది టీడీపీ కోవర్టులు రాజంపేటలో టీడీపీని ఓడించారని విమర్శించారు. టీడీపీలో ఉంటూ పదవులు అనుభవిస్తూ టీడీపీని మోసం చేసిన వారికి పుట్టగతులు ఉండవన్నారు. అలాంటి వారికి అధిష్టానం తగిన గుణపాఠం చెబుతుందన్నారు. వర్గాల పేరిట టీడీపీ కార్యకర్తలకు ద్రోహం చేస్తే సహించేది లేదన్నారు. వర్గ విభేదాలు సృష్టిస్తూ కార్యకర్తలపై చెయ్యి వేస్తే మీ తాతల దగ్గరికి పంపిస్తామని హెచ్చరించారు. రాయచోటి, రాజంపేటలలో కార్యకర్తలకు అండగా నిలబెడతామన్నారు. రెండు నియోజకవర్గాల్లో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని సభా వేదికగా పేర్కొన్నారు. తన తండ్రి ఏ ఆశయంతో పనిచేశారో అందరికీ తెలుసు కానీ ఆయన చివరి రోజుల్లో సుగవాసి కుటుంబానికి కొంత మంది తీరని అన్యాయం చేశారంటూ జిల్లా మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షులపై నర్మగర్భంగా విమర్శలు చేశారన్నారు. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఎవరూ టీడీపీ కార్యకర్తల జోలికి వచ్చిందే లేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక టీడీపీ నాయకులు వర్గ రాజకీయాలు చేస్తూ జెండా మోసిన కార్యకర్తలను అధికార దర్పంతో అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. సుగవాసి పాలకొండ్రాయుడు 84 సంవత్సరాల వయస్సులోనూ రాయచోటిలో 2024 సార్వత్రిక ఎన్నికలలో టీడీపీని గెలిపించారన్నారు. తన తండ్రి ఏ బాటలో నడిచారో అదే బాటలో తాను నడుస్తానని, పేద ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వేలాది మంది సంస్మరణ సభకు తరలిరావడం సంతోషదాయకం అన్నారు. మా తండ్రి మాకిచ్చిన వారసత్వం మీ అందరి అభిమానం అన్నారు. మా తండ్రికి అండగా నిలిచిన సుండుపల్లె మండల ప్రజల రుణం తీర్చుకుంటామన్నారు.

విశ్వవిద్యాలయాలలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎం.అంకన్న

రాయచోటి టౌన్ : రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న అన్నారు. ఆదివారం రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కార్యాలయంలో ఆయన్ను కలసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని వాటిని గుర్తించి వెంటనే భర్తీ చేయాలని కోరారు. అలాగే కడపలోని యోగి వేమన, వైఎస్సార్ ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయంలో అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు. అనేక కళాశాలలో బోధన, బోధనేతర ఉద్యోగులు లేకపోవడం వలన రుసా, యూజీసీ నిధులు రాకుండా నిలిచిపోయాయన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి బోధన, బోధనేతర ఉద్యోగులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రవీంద్ర, శివకేశవ, తదితరులు పాల్గొన్నారు.

బీసీ మహిళా ప్రజాప్రతినిధిపై దాడి నీచం


మాట్లాడుతున్న విజయభాస్కర్

రాయచోటి జగదాంబసెంటర్ : కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్, బీసీ మహిళా నాయకురాలు ఉప్పాల హారికపై టీడీపీ, జనసేన నాయకులు దాడికి పాల్పడటం నీచమైన చర్య అని వైఎస్ఆర్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సిబ్యాల విజయభాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాయచోటిలోని వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో మోసపూరిత హామీలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 14 నెలలు గడిచినా ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. బీసీ మహిళ అయినటువంటి జెడ్పీ చైర్‌పర్సన్‌పై కూటమి నాయకులు దాడికి పాల్పడటం అత్యంత అమానుషమన్నారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని చంద్రబాబుకు పుట్టగతులు ఉండవన్నారు. ఇకనైనా నీచపు సాంప్రదాయాలను మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ బీసీ నాయకులు రవీంద్ర యాదవ్, సంజీవయ్యలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రశ్నార్థకంగా మహిళా భద్రత

సిద్దవటం : కూటమి ప్రభుత్వంలో మహిళా భద్రత ప్రశ్నార్థకంగా మారిందని వైఎస్ఆర్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దవటం మండలం భాకరాపేటలో ఆదివారం ఆమె మాట్లాడుతూ కాకినాడ జీజీహెచ్‌లో 50 మంది పారామెడికల్ విద్యార్థినులపై ల్యాబ్ సిబ్బంది లైంగిక వేధింపులకు పాల్పడటం, మాట వినకపోతే పరీక్షల్లో ఫెయిల్ చేస్తామని బెదిరించడం దారుణమన్నారు. మహిళలు, చిన్నారులు, విద్యార్థినులకు ఈ కూటమి ప్రభుత్వంలో రక్షణ కరువైందన్నారు. ల్యాబ్ సిబ్బందిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

అన్నదాన ట్రస్టుకు మూడు ఎకరాల భూమి విరాళం


భూ డాక్యుమెంట్లు ట్రస్టు సభ్యులకు అందజేస్తున్న దాత శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు

తంబళ్లపల్లె: మల్లయ్యకొండ శ్రీ మల్లికార్జునస్వామి సోషియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అన్నదాన ట్రస్టుకు మూడు ఎకరాల భూమి విరాళంగా ఇచ్చారు. తంబళ్లపల్లెలోని గనముక్కల మునెమ్మ, సుబ్బరాయప్ప దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు శ్రీనివాసులు, మనవళ్లు శివరాయుడు, భరత్‌రాయుడులు ఆదివారం మూడు ఎకరాల భూమిని అన్నదానట్రస్టుకు విరాళంగా ఇచ్చి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. భూమికి సంబంధించిన డ్యాకుమెంట్లు అన్నదానట్రస్టు సభ్యులకు అందజేశారు. వారు అన్నదానట్రస్టు అభివృద్ధికి సహకరించడం, వారి దానగుణానికి ట్రస్టు సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుదాం



మాట్లాడుతున్న పీసీ రెడ్డన్న

రాయచోటి టౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్స్ సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం సాగిద్దామని ఆంధ్రప్రదేశ్ సంఘం రాష్ట్ర సెక్రటరీ పీసీ రెడ్డన్న పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్జీఓ హోంలో జిల్లా అధ్యక్షులు బి.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై పోరాటం సాగిస్తున్నామని ఈ క్రమంలోనే 15వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పోరాట దీక్షను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవల్సిందిగా కోరారు. ప్రస్తుత ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అందుకే మన సమస్యలను మనం పోరాటం ద్వారా సాధించుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వి.రెడ్డి కుమార్, మహిళా కన్వీనర్ గంగాదేవి, రామచంద్ర, తాలూకా అధ్యక్షులు చెంగల్‌రెడ్డి, జిల్లా కోశాధికారి జయచంద్రారెడ్డి, ఎంవీ రమణ, పి.ఈశ్వరయ్య, విశ్వనాథరెడ్డి, కొండారెడ్డి, రంగారెడ్డి, జయచంద్రారెడ్డి, కృష్ణమూర్తి, వెంకటస్వామి, రామచంద్రయ్య, తుడిబండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు


కడప అర్బన్: పానల్ న్యాయవాదులచే 'మధ్యవర్తిత్వంపై' కడప కోర్టు ప్రాంగణం నాల్గవ అదనపు జిల్లా కోర్టు దగ్గర ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి, ఇంచార్జ్ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శాంతి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ ర్యసందర్భంగా ప్యానల్ న్యాయవాదులు మాట్లా డుతూ మధ్యవర్తిత్వం ప్రాముఖ్యతను తెలియజేశారు. మధ్యవర్తిత్వం సంబంధించిన కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది హసీనా, మధ్యవర్తిత్వ న్యాయవాది శారద, పారాలీగల్ వాలంటరీలు శ్రీనివాసరావు, జిలాని, ప్రజలు పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే ఆలయాలకు మహర్దశ


ప్రత్యేక పూజలు చేయిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు

సంబేపల్లె : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఆధ్యాత్మిక చింతన పెంపొందించడంలో భాగంగా ఆలయాల నిర్మాణాలకు పెద్ద ఎత్తున నిధులు వెచ్చించినట్టు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండంలోని ప్రకాష్‌నగర్‌కాలనీ గ్రామం నగరిలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాలయంలో ఆయన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలసి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాల నిర్మాణాలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మహర్దశ కలిగిందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 76 ఆలయాలు మంజూరు చేయడం జరిగిందని, త్వరలోనే ఆలయాల నిర్మాణపు పనులు పూర్తవుతాయన్నారు. అనంతరం సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఆలయాలు నాగరికతకు ప్రతీకలని ప్రజలందరిలో భక్తి భావం పెంపొందాలన్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి, నాయకులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, వి.వి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఆవుల వేణుగోపాల్ రెడ్డి, షేక్ వెంకటరామిరెడ్డి, అమరనాథరెడ్డి, సర్పంచ్ రామచంద్ర, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అన్నారెడ్డి, వడ్డి వెంకటసుబ్బారెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగిరి గ్రామంలో పర్యటించిన గడికోట, సుగవాసి


రామచంద్ర నాయుడు నివాసంలో రైతుల సమస్యలపై చర్చిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, సుగావాసి

సంబేపల్లె : మండల పరిధిలోని పీఎస్ కాలనీ గ్రామం నగిరిలో ఆదివారం వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బాలసుబ్రమణ్యంలు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వివి ప్రతాప్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, వాసుదేవరెడ్డిలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామలంలో నెలకొన్న సమస్యలపై ఆరాతీశారు. వర్షలు లేక రైతులు పడుతున్న కష్టాలు, పండిన పంటలకు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలపై చర్చించారు. పాలకు గిట్టుబాటు ధర లేదని నాయకుల ఎదుట పాడి రైతులు వాపోయారు. అనంతరం రామచంద్ర నాయుడు, ఉమామహేశ్వర నాయుడు ఇచ్చిన తేనేటి విందులో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో జగన్నాథనాయుడు, రమేశ్‌నాయుడు, ఖగేంద్రరాజు, సంబేపల్లె, నగిరి యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు పెంచాలి


మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన కార్మికులు

రాజంపేట : మున్సిపాలిటీలో పనిచేసే వాటర్ సెక్షన్, ఎలక్ట్రికల్ సెక్షన్ కార్మికుల వేతనాలు తక్షణమే పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. మున్సిపాలిటి వద్ద కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏడు సంవత్సరాల నుంచి వేతనాలు పెంచకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. పాలకులు కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికుల కన్నెర్ర చేస్తే ప్రభుత్వాలు కూలక తప్పవని హెచ్చరించారు. అనేక రకాలు తాము ఆందోళనలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కార్మిక నేతలు పీవీరమణ, గంగయ్య, రమేష్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీరభద్రుడికి విశేష పూజలు


పూజలందుకున్న వీరభద్రస్వామి, భద్రకాళీ

రాయచోటి : దక్షిణ కాశీగా పేరుగాంచిన రాయచోటి శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో భక్తులు ఆదివారం విశేషంగా పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మొదట వినాయకునికి పూజల చేసిన అనంతరం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారికి రుద్రాభిషేకాలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయాలనికి వచ్చిన స్థానిక భక్తులతో పాటు కేరళ, కర్నాటక భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం సాయంకాలం వేళ శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారికి సంధ్యాకాల పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మల్లూరమ్మ ఆలయంలో..


మల్లూరమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యా నదిపై కొలువై ఉన్న శ్రీ మల్లూరమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.

31 మందికి కంటి ఆపరేషన్లు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది

రాయచోటి టౌన్ : రాయచోటి లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో 31 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు లయన్ కంటి ఆస్పత్రి చైర్మన్ వైవీ స్వరూప గుప్తా తెలిపారు. ప్రతి ఆదివారం రాయచోటి లయన్ ఆస్పత్రిలో కంటి పరీక్షలు, తరువాత ఆపరేషన్లు నిర్వహిస్తారు. ఈ క్రమంలోనే ఆదివారం 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 30 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించిన వైద్యులు ఆపరేషన్లు చేశారు. అలాగే గత వారం ఆపరేషన్లు నిర్వహించిన వారిలో 40 మందికి ఉచితంగా మందులు, కళ్ల అద్దాలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాషా, చెన్నముక్కపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, ఆప్తమాలిక్ అసిస్టెంట్ మూలి రాజ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిశ్చితార్థ వేడుకలో కొరముట్ల


వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, నాయకులు

ఓబులవారిపల్లె : తల్లెంవారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కొలవల అమర్‌నాథ్ రెడ్డి కుమార్తె పల్లవి రెడ్డి, ధనుంజయ రెడ్డి నిశ్చితార్థానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు హాజరయ్యారు. తిరుపతి సురభి గార్డెన్స్‌లో ఆదివారం నిశ్చితార్థ వేడుకలను నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల నిశ్చితార్థానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ సీనియర్ నాయకులు హేమనవర్మ, రాయలసీమ జోనల్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్‌కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ ముక్కా రమేష్ కుమార్, సర్పంచ్‌లు మల్లెం ఈశ్వరయ్య, సుంకేసుల రఫీ, సిగమాల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుద్ధునికొండను పరిశీలించిన డీఎస్పీ



మదనపల్లె రూరల్ : బుద్ధ విగ్రహం ధ్వంసం కేసు విచారణలో భాగంగా ఆదివారం డీఎస్పీ మహేంద్ర, మండలంలోని అంకిశెట్టిపల్లె పంచాయతీ బుద్ధునికొండను పరిశీలించారు. విచారణలో భాగంగా ఘటన జరిగిన రోజుకు సంబంధించి సెల్‌ఫోన్ సిగ్నల్స్ డంప్‌ను సేకరించామన్నారు. తాలూకా సీఐ వెంకటరమణను అడిగి కేసు ప్రగతిపై తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులను విచారించారు. కేసు దర్యాప్తులో భాగంగా అనుమానితులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు.